
# తమాషా

పాలడుగు వెంకటేశ్వరరావు



ఈ మధ్యే విజయ్ కొన్న కొత్త ఫియెట్ కారు రోడ్డు మీద మెత్తగా జారిపోతూవుంది స్టీరింగ్ దగ్గర-విజయ్ కూర్చుని, విలాసంగా కారు నడుపుతూ కబుర్లు చెప్తూ వున్నాడు నేను వింటున్నాను.

బజార్లో జనం రద్దీ ఎక్కువగా వుంది షాపుల్లో రంగురంగుల దీపాలు వెల్గుతూ కష్టమర్లని ఆకర్షిస్తున్నాయ్ మునిసిపాల్టీ వారు కొత్తగా పెట్టిన సోడియం వేపర్ లాంపుల వెలుగులు చీకట్లని పారద్రోలి, పట్టపగలు అనిపించుతున్నట్లుగా వుంది, రోడ్డుమీద

నాలుగురోడ్ల జంక్షన్‌వద్ద రెడ్ లయిటును చూసి, కారు ఆగింది విలాసంగా జేబులోనించి సిగిరెట్ పెట్టె తీసి, తను ఒకటి వెలిగించుకుని, నాకొకటి ఆఫర్ చేసాడు విజయ్ మళ్ళీ సిగరెట్ పెట్టెని జేబులోకి తోస్తూ, గుండెలనిండా పొగ పీలుస్తూ, జేబులోనించి పర్సుని తీసి తెరిచాడు విజయ్

'నాకొక ఆయిడియా వచ్చింది చిన్న తమాషా చేస్తాను చూస్తావా?' అని నన్ను అడిగాడు నేను నవ్వి తల వూపాను. విజయ్ తమాషాల మనిషి ఎక్సెంట్రిక్'

విజయ్ తెరచిన పర్సులోనించి, కొత్త వందరూపాయలనోట్లు రెపరెపలాడాయ్. వాటిల్లోనించి ఒక నోటు తీసాడు విజయ్ చెయ్యి బయటికి చాచి, ఆ నోటుని వదిలాడు గాలిలోకి విలాసంగా, సుతారంగా, ఎవరికీ కనపడకుండా

చిరుగాలికి అలా అలా తేలి-ఆనోటు, ఫుట్‌పాత్ మీద, సోడియం వేపర్‌లాంప్ గుమ్మరించుతూవున్న వెలుతురు ముద్దల్లో స్నానం చేస్తూ వున్నది సిగ్నల్ పోల్‌కి వున్న ఆకుపచ్చ లయిట్ వెలిగింది ట్రాఫిక్‌లో చలనం వచ్చింది కారుని ముందుకి తీసి 'లిడో బార్ అండ్ రెస్టారెంట్' ప్రక్కనే ఆపాడు విజయ్

ఇద్దరం కారు దిగి, ఫుట్‌పాత్ మీద నిలబడ్డాము విజయ్ కబుర్లుచెప్తూవున్నాడు అవతల, కార్నర్‌లో ఫుట్‌పాత్‌మీద పడి

వున్న ఆ కొత్త వందరూపాయల నోటు, మా దృష్టిని తప్పించుకొనలేకపోయింది మాట్లాడుకుంటూ, అటే మేం చూస్తుం డగా_కూరల బుట్టతో ఒక ఇల్లాలూ, సిగరెటు తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ వున్న నలుగురు కాలేజీ స్టూడెంట్సు, ఇద్దరు- కబుర్లుఆడుతూ, హాండ్ స్టిక్స్‌తో మందంగా సాగుతూవున్న - రిటయిర్డు గవర్నమెంట్ వుద్యోగులూ, అడు క్కుంటూ వున్న ఒక గుడ్డి ముసలిదీ అటుగానే పోయారు కొన్ని నిమిషాల వ్యవధిలో

కానీ, ఎవరూ ఆ వందరూపాయల కొత్తనోటుని గమనించ లేదు అంతలో ఒక నల్లకుక్క అటుగా వచ్చింది ఆ నోటుని గమనించి, మూతితో దాన్ని వాసన చూసి, చీదరించుకుని, చెత్తకుండీ వయిపు సాగిపోయింది ఆ తర్వాత అక్కడికి, ఒక కుంటి ముష్టి వాడు కుంటుకుంటూ వచ్చాడు

చిరుగాలికి రెపరెపమంటూ వున్న ఆ నోటు అతన్ని ఆకర్షించింది నమ్మ లేనట్లుగా, ఆశ్చర్యంగా, ఆనందంగా, అతను దానివయిపు చూసాడు ఆ వంద రూపాయలనోటు ఎవరి దృష్టిలోనయినా పడిందేమోనని, దాన్ని ఇంకెవరయినా గమనిస్తూ వున్నారేమోనని, నాలుగు వయి పులా పరాకాయించి చూసాడు ముష్టి వాడు క్షణాలలో తన కుంటికాలుని వేలాడేసి, వంగి, చటుక్కున ఆనోటుని అందుకోబోయాడు.

అంతలో అతని చేతిమీద ఒక కాలు పడింది

ఆ కుంటి ముష్టివాడు గిల గిల లాడాడు

'రాస్కెల్! దొంగ వెధవా! నా చేతి లోంచి జారిన ఈ నోటుని తీసుకుని పారిపోవటానికి ఎన్ని గుండెలురా నీకూ!!'- ఫెడీఫెడీమని నాలుగు గుద్దులు వీపుమీద పడటంతో, బెదరి, ఆ పట్టుని తప్పించుకుని బ్రతుకుజీవుడా అను కుంటూ, కాలికి బుద్ధిచెప్పాడు కుంటి ముష్టివాడు

ఎర్రబడిన కళ్ళూ, మాసిన గడ్డమూ, నలిగిన బట్టల్తో వున్న ఆ పెద్దమనిషి వంగి ఆత్రంగా ఆ నోటుని అందు కున్నాడు అక్కడికి నాలుగంగల్లో నిల బడి గమనిస్తూవున్న, ఒక దృఢకాయుడు గబగబా అతని వద్దకు వెళ్ళాడ, మేం చూస్తూవుండగానే

'మిస్టర్! ఆ నోటు నాది నా పర్సు లోంచి జారిపడిపోయింది మర్యాదగా తిరిగి నాకు ఇచ్చావో సరే, లేకపోతే, అదుగో అటువయిపు తిరిగి నిలబడివున్న పోలీసును పిలుస్తాను నువ్వు ఎక్స్‌క్రిమి నల్‌వని, ఆ పోలీసు ఇట్టే గుర్తించ గలడు అని బెదరించి ఆ నోటుని లాక్కున్నాడు క్రూరంగా చూస్తూ, ఆ తలమాసిన మనిషి, అక్కడ్నించి గబ గబా జారుకున్నాడు

ఆ కొత్త వందరూపాయల నోటు అతని చేతిలో మెరుస్తూ ఫెళఫెళలాడింది చటుక్కున దాన్ని జేబులో పెట్టుకో బోయాడు, అతను అంతలో - వాడిన మొహానికి మేకప్‌తో కొత్త కళ తేవ టానికి విఫలప్రయత్నం చేసిన ఒక మధ్య వయసు స్త్రీ, ఎలక్ట్రిక్‌పోల్ చాటునించి, అతని మీదకి దూకింది అతని చేతిలోవున్న ఆ నోటుని గబుక్కున లాక్కుని తన జాకెట్‌లోకి దోపుకుంది, మెరుపులాగా

'అమ్మదొంగా! దీన్ని మొదట చూసింది నేనూ! కనుక ఇది నాదీ నువ్వెట్లా తీసు కుంటావ్? కావాలంటే ఆ పోలీసాయన దగ్గరికి పోదాం పద' అంది, ధీమాగా.

ఆ ధృఢకాయుడు ఆమెవంక తీక్ష ణంగా చూసి, 'అడు నీ రంకుమొగుడని నాకుతెల్సులేవే! అందుకేగదా, నీవూపూ! నీ సంగతి తరవాత చూస్తాలే' అని హెచ్చరించి, అక్కడ్నించి జారు కున్నాడు, చల్లగా

ఆ స్త్రీ అక్కడ్నించి నడిచి చకచకా సాగిపోయింది, చీకటి అంచుల వెంట

'చూసావా! చివరికి ఆ నోటు ఆ స్త్రీకి దక్కిందన్నమాట!' అన్నాను, నవ్వి

'తొందర పడకు అప్పుడే అయిపో లేదు అటు చూడు అన్నాడు విజయ్'

ఆ స్త్రీ గబగబా మెయిన్‌రోడ్డునించి, వీడల సందుల వెంట, ఒక గల్లీలోకి తిరుగుతూ వుంది ఆమె ననుసరించి సాగింది ఒక నీడ ఆ నీడ, ఒక సన్నని పురుషాకారానిది! అటుదిరిగి సాగిపోతూ వున్న ఆ నడకనాకు పరిచితమయినదిగా అన్పించింది కాని, పోల్చుకోలేక పోయాను 'అదెవరు!!' అన్నాను ఆశ్చ ర్యంగా నేను

'నువ్వు గుర్తించలేదా!'

'చీకట్లో ఏం గుర్తించేసి!'

'నువ్వు ఆ నడకను పొల్చుకోలేదా!'

'ఉహూ'

'వాడు ఆనంద్'

'ఆనందా!!'

'అవును ఇక పోదాం రా. ఇప్పటికే లేటయింది, అని నన్ను చెయ్యి పట్టుకుని, లిడో బార్‌లోకి తీసుకువెళ్ళాడు విజయ్

బేరర్‌కి ఆర్డరిచ్చాక, మే మిద్దరమే మిగిలివున్న అవకాశాన్ని అందుకుని, 'ఆనంద్ ఇప్పుడు ఏం చేస్తున్నాడు!' అని అడిగాను, విచారంగా

విజయ్ మిశ్చవస్‌గా నవ్వాడు

అన్ని వ్యసనాలకీ బలిఅయి, పేద రికంలో పందిలాగా పొర్లుతున్నాడు రాస్కెల్'

'పాపం!'

'అందుకు కారణం ఎవరో తెలుసా! నేనే నేనే, కావాలని, స్నేహం నటి స్తూనే ఈ అలవాట్లన్నీ అతనికి అంటించి మోసంచేసి, దగా చేసాను ఆనంద్‌ని పాతాళానికి అణగద్రొక్కాను వీధుల పాలు జేశాను అన్ వాంటెడ్ ఎలి



మెంటుగా వాడ్ని మార్చి నా పగ దీర్చుకున్నాను.' విజయ్ నవ్వులో సాడిజం ఛాయలున్నాయి.

'దారుణం!'

'నా స్పర్ధకి కారణభూతురాలయిన, ఆ రాగిణి వీడికోసం పిచ్చ ప్రేమతో ఇంటి దగ్గర ఎదురుచూస్తూ, నిద్రాహారాలుమాని ఏడుస్తూ వుంటుంది. వీడు తాగి తందానా లాడి ఇల్లుచేరి, ఏ అర్ధరాత్రి వేళో, రాగిణి వళ్ళు అకారణంగానే కుమలపొడిచి, స్పృహతప్పి పడిపోతాడు, మైకంలో, ప్రతిరోజూ.'

'ఇది అన్యాయం బ్రదర్!' అన్నాను జాలిగా. అక్కడ మా సంభాషణ ఆగిపోయింది.

డ్రింక్స్, ఫుడ్డూ వచ్చాయి. బేరరు టేబులు మీద గ్లాసులూ, సోడాలూ, ప్లేట్సూ, ఐస్ జగ్గూ సర్దుతూ వున్నాడు. నామనస్సు ఆలోచనల్లో మునిగిపోయింది పదిహేనేళ్ళ క్రితం—

ఆ వూరి కాలేజీలో, నేనూ, విజయ్, ఆనంద్, రాగిణీ బి.ఎస్‌సీ. క్లాసు

విద్యార్థులలో కొందరిమి. నేను బి.ఎస్‌సి. తర్వాత ఎం.బి.బి.ఎస్. చదివి, అపూళ్ళోనే ప్రాక్టీసు పెట్టి, పుష్కలంగా పేరూ, డబ్బూ గడించాను. ఆ రోజుల్లో-విజయ్ రాగిణిని ఎంత గాఢంగా ప్రేమించాడో నాకు తెలుసు కానీ, రాగిణి అతన్ని తిరస్కరించి, ఆనంద్‌ని కోరి పెళ్ళిచేసు కుంది. ఆ తర్వాత విజయ్, ఆనంద్ కలిసి ఒక పెద్ద ఇండస్ట్రీ పెట్టట. కొంతకాలానికి ఏవో గొడవలుపడి విడి పోవటం గురించి నేను విన్నాను. కానీ డీటెయిల్సు నాకు తెలియవు.

'కమాన్ బ్రదర్! ఛీర్స్.' అన్నాడు విజయ్, బేరర్ అవతలికిపోయాక గ్లాసులు నింపి. యాంత్రికంగా ఛీర్స్ చెప్పాను. కానీ నా మనస్సు అల్లకల్లోలంగా వుంది.

మూడో రవుండయాక, మూడ్‌లోకి వచ్చాడు విజయ్.

'బ్రదర్! దేవుడు మనుషుల జీవితా లతో ఆడుకోవటానికి తమాషాలు చేస్తాడు. డబ్బు మనిషిని పిచ్చివాడ్నిచేసి, ఆటలాడు కుంటుంది. వ్యసనాలు మనిషిని బానిసని చేసి పీల్చి పిప్పిగాచేసి, అయోగ్యుడుగా అసమర్థుడుగా చేస్తాయి. ఇంతా సంపా దించినా కూడా నేను ఇంకా, తాడూ బొంగరంలేకుండా అవివాహితుడుగానే వుండిపోవటానికి కారణం నీకు తెలుసా?'

'ఉహూ!'

'అందుక్కారణం నాయొక్క పవిత్ర ప్రేమ. హృదయమనే బంగారు కలశంలో పోసి ప్రేమ అనే అమృతాన్ని పవిత్రభావంతో అందించాను. తిరస్ రానికి గురయిన ఆ కలశం నేలమీద పడింది. నా ప్రేమ నేలపాలయింది. ఎంత ఘోరం!'

'ప్చ్!'

'ఇక్కడొక తమాషా వుంది బ్రదర్! ఇంత జరిగినా, అవమానంతో, స్పర్థతో నా గుండెలు మండి, ప్రజ్వరిల్లుతూవున్నా కూడా, స్టిల్....స్టిల్ అయ్ లవ్ దట్ రాస్కెల్! దట్ డామ్సెల్ క్రూయల్ రాగిణీ!'

'స్టిల్ యూ లవ్ హర్!!'

'యా.'

'కానీ, ఆమె వివాహిత గదా! ఆ జ్ఞానం నీకు లేకపోయిందా?'


'టు హెల్ హర్ మారేజ్! నేను ఒప్పుకోను. అందుకే-అందుకే మిస్టర్! భగభగ మండిన నా ప్రతీకారాగ్ని జ్వాలలలో ఆ ఆనంద్‌గాడు, మాడి మస యిన శలభం అయ్యాడు.' విజయ్ కళ్ళు ఎర్రగా అగ్నిగోళాల్లాగ మండుతున్నాయ్.

నేను పళ్ళు కొరుక్కున్నాను.

'నువ్వుచేసిన ద్రోహానికి ఆనంద్ నిన్ను సాధించజూడలేదా?'

విజయ్ పకపక నవ్వాడు. ఆ నవ్వు క్రూరంగా, వికృతంగా వుంది.

'హౌ డేర్ హీ ఈజ్! వాడొక ఇన్ కాంపిటెంట్ అండ్ ఇన్నోసెంట్ డాం ఫూల్! నా జోలికి రావటానికి వాడికి




గుండెలు లేవు! అదీగాక — ఇప్పుడు — అయామే మిలియనీర్ అండ్ హీ ఈజే పాపర్ ఏంచెయ్యాలన్నా ఎప్పుడయినా ఒక మనిషికి తగిన తాకత్ కావాలి లీవ్ హిం టు హిజ్ నాటుసారా! బట్ దట్ వుమన్ షీ బర్న్ టిల్ మై హర్ట్! బ్రదర్! నేను మండుతున్నాను

విజయ్ కళ్ళల్లో నీరు వూరింది

నువ్వు నమ్మాలి బ్రదర్! వైస్‌లో పెట్టి నొక్కినట్లు నిరంతరం పీడిస్తూ వున్న ఈ హృదయ శల్య బాధని నేను భరించలేను ఎప్పుడో ఈ గుండె పేలిపోయి సడన్‌గా నేను చచ్చిపోతాను

చచ్చిపోతాను — గ్లాసులో మిగిలివున్న డ్రింక్‌ని ఒక్క గుక్కలో పూర్తి చేసి గ్లాసు బోర్లించాడు విజయ్ అతని మొహంనిండా కన్నీళ్ళ తడి.

లవ్ ఈజ్ బ్లయిండ్ లవ్ ఈజ్ ప్యూర్ లవ్ ఈజ్ ఆల్సో క్రూయెల్ మా టేబిల్ దగ్గరకి బేరర్ వచ్చి నిలబడ్డాడు డాక్టర్ రావ్ సర్!!

అయాం డాక్టర్ రావ్ అన్నాను

ఫోన్ సర్!

నేను లేచి గబగబా ఫోను దగ్గరకి వెళ్ళాను ఎమర్జెంట్ కేస్! విజయ్ కారు డ్రైవుచేసుకుంటూ నన్ను నర్సింగ్ హోంకి తీసుకువెళ్ళాడు నా కొలీగ్ డాక్టర్ మూర్తి నాకోసం అదుర్దాగా ఎదురుచూస్తూ వున్నాడు

కల్తీసారా కేసు! అప్పటికే ప్రికాషన్స్ అన్నీ తీసుకుని డాక్టర్ మూర్తి ప్రాణభయం లేకుండా చేశాడు బెడ్ దగ్గరకి వెళ్ళి పేషంట్‌ని చూసాను నా నరాల్లో రక్తప్రసారం కొన్ని క్షణాలు స్తంభించింది

నా ప్రక్క నేవున్న విజయ్ కేసి చూసాను విజయ్ కళ్ళల్లో, క్రూరమయిన నవ్వు! హారిబుల్! విజయ్ మొహంలో రాక్షస కళ

ఆ పేషంట్ ఆనంద్! మా ఆనంద్

నేను అప్పుడే మీకు చెప్పాను బ్రదర్ ఆ వంద నోటుని వీడు ఆమెనించి లాక్కుని తిన్నగా అరక్ షాపుకి వెళ్ళివుంటాడు పూర్ ఫెలో! పే చేసి కూడా కల్తీసారా పాలయ్యాడు ఓస్ ఫెలో డిజర్వ్స్ దిస్ రాస్కెల్

షటప్ కాసేపు బయటికి వెళ్తావా! డోన్ట్ డిస్టర్బ్ ద పేషెంట్ కఠినంగా అన్నాను నోరు మూసుకుని విజయ్ బయటికి వెళ్ళిపోయాడు

డాక్టర్ మూర్తికి నేను వచ్చాక కొండంత బలం వచ్చింది ఆయనతో కేసు డిస్కస్ చేసి ఫర్దర్ కోర్సు గురించి సూచనలిచ్చాను డాక్టర్ మూర్తి ఆ పనిలో వున్నాడు

నేను యథాలాపంగా అడుగులు వేస వరండాలోకి వచ్చాను

అక్కడ విజయ్ ఎవరో స్త్రీతో మాట్లాడుతున్నాడు వున్నట్లుండి ఆమె గొంతు పెద్దదయింది చివాల్న చెయ్యి చాచి ఆమె విజయ్ చంపమీద గట్టిగా కొట్టింది వొంగిన చంపని చేత్తోపట్టుకుని విజయ్ హాస్పటల్ బయట నిలబడివున్న కొత్త ఫియెట్ వయిపు అడుగులు వేస్తున్నాడు, తూలుతూ

గబగబా నేను, ఆమెని సమీపించాను

చిక్కి శల్యావశిష్టమయిన శరీరంతో, లోతుకుపోయిన కన్నులతో దీనంగా అపరశోకమూర్తిలా, నిలబడివున్న ఆమె మొహం కన్నీటితో తడిసి వుంది రోషంతో బాగా ఎర్రగా అయివుంది

అతి కష్టంమీద నేను ఆమెని గుర్తించాను

ఆమె రాగిణి! ప్రేమ ప్రతీకారానికి బలి అయిన అభాగిని దుఃఖ జీవని నా మనస్సు నిశ్శబ్దంగా రోదించింది

అమ్మో! ఫియెట్ దగ్గర నుంచి ఆక్రందన వినవచ్చింది

గుండెలు చేత్తోపట్టుకుని విలవిలలాడ్తూ విజయ్ కూలిపోతున్నాడు! నేను విజయ్ వయిపు పరుగుదీసాను